సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 20 । నవంబర్ । 2023



ఘనంగా నిత్య కల్యాణం
సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

• సరస్వతీ నిలయాలకు కొత్తరూపు



9లో

ఇది కదా అభివృద్ధి

జిల్లాలో సరస్వతీ నిలయాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిచ్చిన ప్రభుత్వం నాడు–నేడు పథకంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతో కార్పొరేట్‌ను తలదన్నేలా మౌలిక వసతులు సమకూరాయి. రంపచోడవరం మండలంలో మొదటి దశలో రూ.11.5కోట్లతో 27 పాఠశాలలను అభివృద్ధి చేసింది. రెండో దశలో రూ.8.95 కోట్లతో మరో 39 పాఠశాలలను అభివృద్ధి చేస్తోంది. వీటిలో ఇప్పటికే చాలా వరకు పనులు పూర్తయ్యాయి.

న్యూస్‌రీల్

బ్రహ్మోత్సవాల్లో జడ్డంగి మహిళల కోలాట ప్రదర్శన



పద్మావతి అమ్మవారి బ్రహోత్సవాల్లో కోలాటాన్ని ప్రదర్శిస్తున్న జడ్డంగి మహిళలు

రాజవొమ్మంగి: కోలాట ప్రదర్శన జడ్డంగి గ్రామానికి గుర్తింపు తెచ్చింది. తిరుపతిలో ప్రస్తుతం జరుగుతున్న పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో శనివారం జరిగిన వేడుకల్లో మండలంలోని జడ్డంగికి చెందిన శ్రీవిజయ దుర్గ భజన మండలి బృందం మహిళలు కోలాటాన్ని ప్రదర్శించారు. సుమారు 20 మందితో ప్రదర్శన ఇచ్చామని భజన మండలి ప్రతినిధి కుప్పిలి లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాగల్లుకు చెందిన గురువు నిమ్మగడ్డ శివరామకృష్ణ నేతృత్వంలో తిరుపతి వెళ్లామని చెప్పారు.పద్మావతి అమ్మవారి బ్రహోత్సవాల్లో తమకు చోటు లభించడంతో జన్మ ధన్యం అయ్యిందని బృందంలోని మహిళలు పేర్కొన్నారు.

22న ఆర్‌ఐటీఐలో జాబ్‌మేళా

అరకులోయ టౌన్‌: స్థానిక ఆర్‌ ఐటీఐలో ఈనెల 22న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్‌ డి. వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఐటీఐ మరియు నిర్మాణ్‌ ఆర్గనైజేషన్‌ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ మేళాలో డెక్కన్‌ ఫైన్‌ కెమికల్‌, నవత ట్రాన్స్‌పోర్ట్‌, పీఎస్‌బి, తదితర 8 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్‌, డిగ్రీ, ఐటీఐ చదివిన వారు తమ ఒరిజినల్‌ ధ్రువ పత్రాలతో హాజరు కావాలని ఆయన సూచించారు. నెలకు రూ.10 వేల నుంచి రూ.25 మధ్య జీతం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఆర్‌ ఐటీఐలో సంప్రదించి, రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలని ప్రిన్సిపాల్‌ సూచించారు.

వాలీబాల్‌ పోటీలకు కిల్లోగుడ విద్యార్థిని ఎంపిక



జాతీయ స్థాయి వాలీబాల్‌ పోటీలకు ఎంపికైన విద్యార్థిని నయోమితో పీడీ

దుంబ్రిగుడ: జాతీయ స్థాయి వాలీబాల్‌ పోటీలకు మండలంలోని కిల్లోగుడ బాలికల ఆశ్రమ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని గొల్లోరి నయోమి ఎంపికై నట్టు హెచ్‌ఎం కళావతి, ఫిజికల్‌ డైరెక్టర్‌ పి.కమల తెలిపారు. ఈ నెల 9 నుంచి 11 వరకు ఏపీ స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లా అండర్‌ 14 విభాగం పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు వారు పేర్కొన్నారు. ఈనెలాఖరున ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయి వాలీబాల్‌ పోటీల్లో పాల్గొంటున్నట్లు వారు వివరించారు.

క్రికెట్‌ సందడి

• భారీ స్క్రీన్లు, టీవీలకు అతుక్కుపోయిన అభిమానులు



గుడివాడ చావిడి వద్ద ఏర్పాటు చేసిన స్క్రీన్‌ వద్ద క్రికెట్‌ మ్యాచ్‌ను తిలకిస్తున్న యువత

పాడేరు రూరల్‌ : వరల్డ్‌ కప్‌ ఫైనల్‌ మ్యాచ్‌ను తిలకించేందుకు ఆదివారం పాడేరు పట్టణంలో క్రికెట్‌ అభిమానులు, యువత ప్రత్యేక భారీ స్క్రీన్లను ఏర్పాటుచేసి తిలకించారు. దీంతో గుడివాడ చావడి, మెయిన్‌ బజార్‌, సాయిబాబా గుడి, అమ్మవారి గుడి, సినిమాహాల్‌ సెంటర్‌ తదితర ప్రాంతాల్లో సందడి నెలకొంది. పట్టణ ప్రజలు ఇళ్లల్లోని టీవీలకు అతుక్కుపోయారు. దీంతో పట్టణంలోని ప్రధాన వీధులన్నీ బోసిపోయాయి.

కొయ్యూరు: ఇండియా–ఆస్ట్రేలియా ఫైనల్‌ మ్యాచ్‌ను కొయ్యూరులో ఆదివారం క్రికెట్‌ అభిమానులు ఎల్‌సీడీల ద్వారా తిలకించారు.

యువత హల్‌చల్‌

చింతపల్లిరూరల్‌: ఇండియా–ఆస్ట్రేలియా వరల్డ్‌ కప్‌ ఫైనల్‌ మ్యాచ్‌ నేపథ్యంలో మండల కేంద్రంలో యువకులు హల్‌చల్‌ చేశారు.ఇండియా మ్యాచ్‌ గెలవాలని ఇండియన్‌ జెర్సీ ధరించి రోడ్లపై సందడి చేశారు.

ముసురుమిల్లి నిండుగా.. రైతుకు అండగా..

• ఖరీఫ్‌ను ఆదుకున్న ప్రాజెక్ట్‌
• 20 వేల ఎకరాలకు పుష్కలంగా సాగునీరు
• ఆయకట్టుకు ఒక టీఎంసీ నీరు విడుదల
• మరో 0.55 టీఎంసీల మేర నీటి నిల్వలు



ప్రాజెక్టు దిగువన సాగవుతున్న వరి



ముసురుమిల్లి ప్రాజెక్టు

రంపచోడవరం: మండలంలోని ముసురుమిల్లి ప్రాజెక్ట్‌ ద్వారా సమృద్ధిగా నీరు సరఫరా కావడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం నెలకొంది. ముసురుమిల్లి ప్రాజెక్ట్‌ నుంచి సుమారు 20 వేల ఎకరాలకు నీరందుతోంది. ప్రాజెక్ట్‌ నిర్మాణంలో 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా పదిశాతం పనులు జరగాల్సి ఉన్నా రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం సాగునీరు సరఫరా చేస్తోంది. ప్రాజెక్ట్‌ దిగువ ఆయకట్టులో మరో 20 రోజుల్లో వరి కోతలు పూర్తికానున్నాయి. మెట్ట ప్రాంత ఆయకట్టుకు రైతుల వినతి మేరకు జనవరి పది వరకు నీటి సరఫరాను కొనసాగిస్తామని అధికారవర్గాలు తెలిపాయి.

ముసురుమిల్లి నీటిమట్టం 114.09 మీటర్లు..

ముసురుమిల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 123 మీటర్లు కాగా ప్రస్తుతం 114.09 మీటర్లు ఉంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 1.6 టీఎంసీలు కాగా ఏటా ప్రాజెక్టు ద్వారా ఖరీఫ్‌, రబీ సాగుకు 2.52 టీఎంసీల నీరు అవసరం ఉంటుంది. ఈ ఏడాది వర్షాలు తక్కువ కావడంతో ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కూడా తగ్గింది. ప్రస్తుత పరిస్థితుల్లో వర్షాలు కురిస్తేనే రబీకి సాగునీరు అందించే అవకాశం ఉందని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు.

భూపతిపాలెం ప్రాజెక్ట్‌..

భూపతిపాలెం ప్రాజెక్టు కింద వరి నాట్లు ఆలస్యం కావడంతో ఖరీఫ్‌కు వచ్చే నెలాఖరు వరకు సాగునీరు సరఫరా చేయాల్సి ఉంది.ఈ జలాశయంపై 11,250 ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటిమట్టం 204 మీటర్లు కాగా ప్రస్తుతం 203 మీటర్ల మేర నీరు ఉంది. నిల్వ సామర్థ్యం 0.645 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.604 టీఎంసీల మేర ఉంది. ప్రతీ రోజు కాలువల ద్వారా 110 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ఖరీఫ్‌ సాగుకు ఎటువంటి ఢోకా లేదని అధికారులు చెబుతున్నారు.

నీటి ఇబ్బందులు తప్పాయి

ఈ ఏడాది మొదటి పంటకు ముసురుమిల్లి ప్రాజెక్టు ద్వారా పూర్తిగా నీరు సరఫరా చేశారు. మరో ఇరవై రోజుల్లో పంట కోతలు పూర్తవుతాయి. ఈ ప్రాజెక్ట్‌ నిర్మించిన తరువాత వర్షంతో సంబంధం లేకుండా పుష్కలంగా నీరందుతోంది. సాగునీటి సమస్య గట్టెక్కింది.

– వై.లక్ష్మణరావు, ఇందుకూరుపేట, దేవీపట్నం మండలం

వర్షాలు పడితేనే రబీకి నీరు

ఈ ఏడాది ముసురుమిల్లి ప్రాజెక్టు కింద కొన్ని చోట్ల వరి నాట్లు ఆలస్యమయ్యాయి. పంటకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నీటి సరఫరా చేస్తాం. ఇన్‌ఫ్లో తగ్గడం వల్ల రబీకి నీటికి నీటి కొరత ఏర్పడుతుంది. వర్షాలు పడి ఇన్‌ఫ్లో పెరిగితే రబీకి నీటి కొరత ఉండదు.

– శ్రీధర్‌, ఇరిగేషన్‌ డీఈ, ముసురుమిల్లి ప్రాజెక్టు

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేకదృష్టి

• విశాఖ రేంజ్‌ డీఐజీ హరికృష్ణ
• కొయ్యూరు, మంప స్టేషన్ల సందర్శన



కొయ్యూరు స్టేషన్‌ను సందర్శిస్తున్న డీఐజీ హరికృష్ణ, ఆయనతో చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్‌ శివకిషోర్‌

కొయ్యూరు: వచ్చే ఏడాది సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి పూర్తి వివరాలు సేకరించాలని విశాఖ రేంజ్‌ డీఐజీ ఎస్‌.హరికృష్ణ ఆదేశించారు. ఆదివారం కొయ్యూరు ,మంప పోలీసుస్టేషన్లను చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌ శివకిషోర్‌తో కలిసి సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలను గుర్తిస్తే దాని ఆధారంగా భద్రత కల్పించేందుకు వీలు కలుగుతుందన్నారు. మండలంలో మారుమూల పంచాయతీలైన ఎం.భీమవరం, యూ.చీడిపాలెం, బూదరాళ్ల పంచాయతీల్లో సమస్యలపై ఆయన స్పందించి పలు సూచనలు చేశారు. సారా తయారీ నిరోధంపై దృష్టి సారించాలని సూచించారు.

కమ్యూనిటీ పోలీసింగ్‌తో మరింత చేరువ

గిరిజనులకు మరింత చేరువ అయ్యేందుకు వీలుగా కమ్యూనిటీ పోలీసింగ్‌ను విస్తరించాలని విశాఖ రేంజ్‌ డీఐజీ హరికృష్ణ ఆదేశించారు. నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగి ఉండాలని సూచించారు. నిర్దేశించిన చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఆపరేషన్‌ పరివర్తన్‌ను విస్తరించి నిత్యం గంజాయిపై నిఘా ఉంచాలన్నారు. కొయ్యూరు మండలంలో గంజాయి సాగు లేకపోయినా తరలిపోతున్న గంజాయిపై దృష్టిసారించాలని సూచించారు. గంజాయి తరలించే వారిపై కఠిన చర్యల తీసుకోవాలని ఆదేశించారు. ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. సీఐ స్వామినాయుడు, ఎస్‌ఐలు రాజారావు, లోకేష్‌కుమార్‌ పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ కేంద్రంగా ‘విశాఖ ఇగ్నో’

ఎంవీపీ కాలనీ: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) విశాఖపట్నం కేంద్రం జాతీయ స్థాయిలో ఉత్తమ కేంద్రంగా ఎంపికైంది. ఈ మేరకు ఇగ్నో విశాఖ ప్రాంతీయ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఢిల్లీలో జరిగిన 38వ ఇగ్నో వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ ఇగ్నో కేంద్రం డైరెక్టర్‌ డాక్టర్‌ గోనిపాటి ధర్మారావు ఢిల్లీ లెఫ్టినెంట్‌ గవర్నర్‌ వినయ్‌కుమార్‌ సక్సేనా చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 2023 ఏడాదికి గాను ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు, నగర ప్రముఖులు ఇగ్నో విశాఖ అధికారులకు అభినందనలు తెలిపారు.

పర్యాటకులను ఆకర్షించేలా కాటేజీలు



అంజోడ సిల్క్‌ఫారంలో కాటేజీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్‌ చీఫ్‌ కన్జర్వేటర్‌ మధుసూదన్‌రెడ్డి



చింతపల్లిలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న డీఎఫ్‌వో సూర్యనారాయణ



కృష్ణాపురంలో ఎకో టూరిజం పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డీఎఫ్‌వో

దుంబ్రిగుడ: అరకు ప్రాంతానికి వచ్చే పర్యాటకులను ఆకర్షించేలా కాటేజీలు అందుబాటులోకి తెచ్చామని ప్రిన్సిపల్‌ చీఫ్‌ కన్జర్వేటర్‌ ఆఫ్‌ ఫారెస్టు వై.మధుసూదనరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మండలంలోని కొర్రాయి అంజోడ సిల్క్‌ఫారం వద్ద నిర్మించిన ఎకో టూరిజం పార్కును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రా ఊటీగా గుర్తింపు పొందిన అరకు ప్రాంతంలోని పర్యాటక అందాలను తిలకించేందుకు దేశవిదేశాల నుంచి సందర్శకులు భారీ తరలివస్తున్నారన్నారు. వారి అభిరుచులకు తగ్గట్టుగా ఎకో టూరిజం పార్కుల్లో కాటేజీలను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఫారెస్టు అధికారి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎఫ్‌వో కార్యాలయ భవనానికి శంకుస్థాపన

చింతపల్లి రూరల్‌: మండల కేంద్రంలో చింతపల్లిలో డివిజనల్‌ అటవీశాఖాధికారి కార్యాలయ, అతిథి గృహ భవనాలకు, కృష్ణాపురంలో ఎకో టూరిజం నిర్మాణ పనులకు ఏపీ చీఫ్‌ కన్జర్వేటర్‌ ఆఫ్‌ ఫారెస్ట్‌ వై.మధుసూదనరెడ్డి వర్చువల్‌ విధానంలో ఆదివారం శంకుస్థాపన చేశారు. స్థానికంగా డీఎఫ్‌వో సూర్యనారాయణ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ డివిజనల్‌ అటవీశాఖాధికారి కార్యాలయం, అతిథి గృహ నిర్మాణాలకు ప్రభుత్వం రూ.1.50కోట్లు మంజూరు చేసిందన్నారు. వీటికి త్వరలో టెండర్లు పిలుస్తారన్నారు. కృష్ణాపురంలో ఎకో టూరింజం ప్రాజెక్టుకు ప్రభుత్వం రూ.25 లక్షలు వెచ్చించిందన్నారు. డిసెంబర్‌ మొదటి వారంలో వీటిని అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌ డీఎఫ్‌వో రాజు,గిరిజన సంక్షేమశాఖ డీఈ చాణిక్య, రేంజి అధికారులు పాత్రుడు, వీరేంద్ర, భార్గవ్‌వర్మ, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ ఛైర్మన్‌ అప్పారావు



ప్రతిభ కనబరిచిన బాలలకు అందజేస్తున్న బహుమతులు

వీఆర్‌పురం: బాలల హక్కులకు భంగం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ ఛైర్మన్‌ కేసలి అప్పారావు హెచ్చరించారు. బాలల వారోత్సవాల్లో భాగంగా బాలలపై వేధింపుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని రేఖపల్లిలోని ఏఎస్‌డీఎస్‌ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల విద్య, హక్కుల పరిరక్షణకు రాష్ట్ర స్థాయిలో కమిషన్‌ పనిచేస్తుందన్నారు. బాలలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సక్రమంగా పౌష్టికాహారం సక్రమంగా అందుతోందన్నారు. బాలల స్నేహపూరిత జిల్లాగా అల్లూరి జిల్లాను తయారు చేయడానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని సూచించారు. బాలల సంరక్షణ జిల్లా అధికారి సీహెచ్‌ వెంకట్రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బాలల విద్యాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అనంతరం బాలలపై వేధింపులు–చట్ట అవగాహన హ్యాండ్‌ బుక్‌ను ఆవిష్కరించారు. వివిధ పాఠశాలలకు చెందిన బాలబాలికలు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యారంగంలో ప్రతిభ కనబరిచిన 21 మందిని, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన 27 మందికి జ్ఞాపికలు, పతకాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి, ఏఎస్‌డీఎస్‌ సంస్థ డైరెక్టర్‌ ఉండవల్లి గాంధీబాబు, రేఖపల్లి సర్పంచ్‌ సరోజిని, ఎంపీపీ కారం లక్ష్మి, తహసీల్దారు ఎన్‌. శ్రీధర్‌, ఏఎస్‌డీఎస్‌ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.





ఆకట్టుకున్న బాలల సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రకృతి అందాలకు ఫిదా

• భారీగా తరలివచ్చిన పర్యాటకులు
• సందర్శిత ప్రాంతాల్లో వీకెండ్‌ సందడి



బొర్రాకు భారీగా తరలివచ్చిన పర్యాటకులు



చాపరాయి ముఖద్వారం వద్ద భారీగా పర్యాటకులు

సాక్షి, పాడేరు: వీకెండ్‌ కావడంతో జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు సందర్శకుల రాకతో కళకళలాడాయి. మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన వంజంగిహిల్స్‌కు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. సూర్యోదయం, మంచు, మేఘాల అందాలను వీక్షించారు.

బొర్రాకు రూ.3.16లక్షల ఆదాయం

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకులు ఆదివారం పోటెత్తారు. సుమారు 3500 మంది తిలకించగా, రూ. 3.16 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్‌ గౌరీ శంకర్‌ తెలిపారు. సరియా, తాటిగుడ, కటికి, చిట్టంపాడు జలపాతాలు పర్యాటకులతో సందడిగా మారాయి.

కొత్తపల్లి జలపాతానికి..

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతానికి పర్యాటకులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా నుంచి భారీగా పర్యాటకులు తరలివచ్చారు. ప్రత్యేక వాహనాల్లో కుటుంబ సమేతంగా వచ్చి జలపాతాల్లో స్నానాలు చేస్తూ సందడి చేశారు. చీకులు, బొంగు చికెన్‌ అమ్మకాలు భారీగా జరిగాయి.

చెరువుల వేనం.. అద్భుతం

చింతపల్లి రూరల్‌: ప్రముఖ పర్యాటక కేంద్రమైన లంబసింగి చెరువులవేనం పర్యాటకులతో కిటకిటలాడింది. శనివారం లంబసింగి చేరుకున్న పర్యాటకులు అక్కడ రాత్రి బస చేసి తెల్లవారుజామున వ్యూపాయింట్‌కు చేరుకున్నాడు. పాలసముద్రాన్ని తలపించే మంచు అందాలను వీక్షించారు. తాజంగి రిజర్వాయర్‌ వద్ద పర్యాటకులు సందడి చేశారు.

చాపరాయికి...

దుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతానికి మైదాన ప్రాంతం నుంచి భారీగా పర్యాటకులు తరలివచ్చారు. అరకు–పాడేరు ప్రధాన రోడ్డు మార్గానికి ఇరువైపులా ఉన్న వలిసె, పొద్దుతిరుగుడు తోటల్లో ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు. చాపరాయి జలపాతంలో స్నానాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు.

మారేడుమిల్లి : మండలంలో ప్రముఖ పర్యాటక ప్రదేశాలైన జలతరంగిణి, అమృతధార జలపాతాలు, వాలిసుగ్రీవ్‌ వనమూలికల సంరక్షణ ప్రదేశం, జంగిల్‌ స్టార్‌, పాములేరు. గుడిస హిల్‌టాప్‌, వ్యూపాయింట్లు పర్యాటకులతో సందడి నెలకొంది. జలతరంగిణి, అమృతధార జలపాతాల్లో స్నానాలు చేస్తూ ఉల్లాసంగా గడిపారు.అటవీ ప్రాంతంలో వంటలు చేసుకొని కుటుంబ సమేతంగా వనభోజనాలు చేశారు.



చెరువులవేనంలో ప్రకృతి అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు



పొద్దుతిరుగుడు తోటలో ఫొటోలు తీసుకుంటున్న సందర్శకులు



కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు



వంజంగి హిల్స్‌కు పర్యాటకులు పోటెత్తిన పర్యాటకులు

క్లుప్తంగా

మధుచందనకు అభినందనలు



పతకాలు సాధించిన మధుచందన

చింతూరు: ఇంటర్ డిస్ట్రిక్ట్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థిని గుత్తుల మధుచందన రెండు కాంస్య పతకాలను సాధించింది. రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగాయి. ఈ పోటీల్లో 81 ప్లస్ కేటగిరీలో పాల్గొన్న మధుచందన జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో కాంస్య పతకాలను సాధించింది. ఆమె పతకాలు సాధించడం పట్ల కోచ్ గోలి గంగాధర్‌తో పాటు కళాశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థినికి పలువురు అభినందనలు తెలిపారు.

గంజాయి నిందితుడికి రిమాండ్



సల్లంగిపుట్టులో గంజాయి సాగు చేస్తున్న కొర్ర రాంబాబు

పెదబయలు : పోయిపల్లి పంచాయతీ సల్లంగి పుట్టులో గంజాయి మొక్కలు సాగు చేస్తున్న వ్యక్తిని అదుపులో తీసుకుని రిమాండ్‌కు తరలించడం జరిగిందని స్థానిక ఎస్ఐ పులి మనోజ్ కుమార్ తెలిపారు. సల్లంగిపుట్టు గ్రామానికి చెందిన కొర్రా రాంబాబు గ్రామ సమీపంలో గంజాయి సాగు చేస్తున్నట్టు సమాచారం అందడంతో వెళ్లి చూడగా గంజాయి సాగు చేస్తున్నట్టు గుర్తించామన్నారు. నిందితుడిని అదుపులో తీసుకుని నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్(ఎన్‌డీపీఎస్)కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. గంజాయి మొక్కల పెంపకం నేరమని, రెండేళ్ల నుంచి ఆపరేషన్ పరివర్తన ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నామని, అయినా కొందరు రైతులు చట్టవ్యతిరేకంగా గంజాయి పండిస్తూ జైలు పాలవుతున్నారని తెలిపారు. రైతులు చట్ట వ్యతిరేక పనులకు దూరంగా ఉండాలని ప్రభుత్వం అందించే పథకాలు సద్వినియోగం చేసుకుని సన్మార్గంలో నడవాలని కోరారు.

జాతీయస్థాయి తైక్వాండో సెలక్షన్లకు ముగ్గురు ఎంపిక



మెడల్స్ సాధించిన క్రీడాకారులతో కోచ్ చందు

ఎస్.రాయవరం: మండలంలో అడ్డురోడ్డు తైక్వాండో క్లబ్‌కు చెందిన ముగ్గురు క్రీడాకారులు జాతీయ స్థాయి సెలక్షన్స్‌కు ఎంపికైనట్టు కోచ్ చందు ఆదివారం తెలిపారు. ఈ నెల 18,19 తేదీల్లో తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు ప్రతిభ కనబరిచినట్టు చెప్పారు. ఆర్.హసీనా, జ్యోత్స్నశ్రీ బంగారు పతకాలు, ఆర్.నందిని వెండిపతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. క్రీడాకారులను కోచ్ చందుతో పాటు అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

ప్రణాళికతో సిద్ధమైతే విజయం మీదే..



అవగాహన సదసుకు హాజరైన విద్యార్థులు, ఉద్యోగార్థులు



మాట్లాడుతున్న బాలలత

- తలరాత మారేలా కసితో చదవాలి
- పోటీ పరీక్షలపై సివిల్స్ విజేత బాలలత సూచనలు
- 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో గ్రూప్–1, 2 అవగాహన సదస్సుకు విశేష స్పందన



శ్రీకాకుళం నుంచి వచ్చిన దంపతులు

విశాఖ విద్య: 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో గ్రూప్–1, 2 ఉద్యోగ పరీక్షలపై విశాఖలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి విద్యార్థులు, ఉద్యోగార్థులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. హైదరాబాద్ సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్, సివిల్స్ విజేత బాలలత గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు. త్వరలోనే గ్రూప్స్ నోటిఫికేషన్ రానున్నందున పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో తెలిపారు.

బాలలత ఇచ్చిన సూచనల్లో కొన్ని..

- ప్రతీ రోజూ 7 నుంచి 8 గంటల పాటు చదువు కోవాలి. 2 నుంచి 3 గంటల పాటు మోడల్ పేపర్లు ప్రాక్టీస్ చేయాలి.
- భారీ మెటీరియల్ జోలికి వెళ్లకుండా, సొంత నోట్స్ సిద్ధం చేసుకోవాలి. పోటీ పరీక్షల్లో వచ్చే ప్రశ్నల స్థాయి ఏటేటా పెరుగుతుండటంతో అందుకు అనుగుణంగా సిద్ధం కావాలి.
- సామాజిక అంశాలపై కచ్చితమైన అవగాహన ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే సంక్షేమ పథకాలపై కూడా అధ్యయనం చేయాలన్నారు.
- ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి అంశాలపై పట్టుసాధించాలి.
- గ్రూప్స్‌లో ఆబ్జెక్టివ్ విధానం అమల్లోకి వస్తున్నందున, తక్కువ సమయంలో పరీక్షను ఎదుర్కొనేలా ప్రాక్టీస్ చేయాలి.

ఒత్తిడి జయిస్తేనే విజయం

పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, ఉద్యోగార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఒత్తిడికి గురికావొద్దన్నారు. గ్రూప్స్ పరీక్షలు మనం ఎదుర్కోగలమా అనే అనుమానం మనస్సులో నుంచి పూర్తిగా తీసేయాలన్నారు. పోలియో కారణంగా కాళ్లకు సమస్య వచ్చినందున మరో వ్యక్తి సాయమందిస్తేనే ప్రయాణం సాగే పరిస్థితుల్లో, చదువుతోనే నా తలరాత మార్చుకున్నానన్నారు. హైదరాబాద్‌లో కోచింగ్ సెంటర్‌కు వెళితే, సివిల్స్ నీ వల్ల అవుతుందా అని అవమానాలకు గురిచేశారని, ఆ కసితోనే 2004లో సివిల్స్ ఆలిండియా 399వ ర్యాంకు, 2016లో 167వ ర్యాంకు సాధించానని చెప్పారు. చదువు నిరంతర ప్రక్రియ అని, చదువుతోనే మన తలరాత మార్చుకోవాలని సూచించారు. మన లైఫ్‌ను మనమే తీర్చిదిద్దుకొని సమాజానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారాలన్నారు. ప్రణాళికాబద్ధమైన ప్రిపరేషన్‌తో ముందుకెళితే విజయం మీదేనన్నారు. పలువురు విద్యార్థులు, అభ్యర్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు మాట్లాడుతూ పలు దపాలుగా గ్రూప్స్ పరీక్షలు రాసి, నాలుగు ఉద్యోగాలకు ఎంపికయ్యాయని, పట్టుదలతో చదివితే ఏదైనా సాధించవచ్చన్నారు. సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఇలాంటి సదస్సు ఏర్పాటు చేయటం హర్షనీయమని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు అన్నారు.



సూచనలిస్తున్న సాక్షి ఎడ్యుకేషన్ విభాగం ప్రతినిధి



నోట్సు రాసుకుంటున్న విద్యార్థులు

సాక్షికి కృతజ్ఞతలు



ప్రైవేటు ఫార్మా కంపెనీలో పనిచేస్తూ, గ్రూప్స్‌కు సిద్ధమవుతున్నాను. బాలలత మేడమ్ క్లాస్ వినాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాను. సాక్షి మీడియా వారు ఇలాంటి సదస్సు ఏర్పాటు చేయటం వల్ల నాలాంటి వారికి ఎంతో ఉపయోగం. సాక్షి మీడియాకు కృతజ్ఞతలు.

– బి.వి.రవీంద్ర, కూర్మన్నపాలెం, విశాఖపట్నం

విలువైన సదస్సు



నేను పాడేరులో స్త్రీ శిశు సంక్షేమశాఖలో ఈవోగా పనిచేస్తున్నాను. గ్రూప్స్‌లో విజయం సాధించి రెవెన్యూలో మంచి పోస్టు కొట్టాలనేది లక్ష్యం, బాలలత మేడమ్ సదస్సుకు వస్తున్నారని తెలిసి వచ్చాను. ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. సాక్షి మీడియా వారు విలువైన సదస్సు ఏర్పాటు చేశారు.

–రెడ్డి విమల, చోడవరం, అనకాపల్లి జిల్లా

ఎంతో ఉపయోగం



బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసి, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాను. బాలలత మేడమ్‌ను తీసుకొచ్చి, మాలాంటి వారికి అవసరమైన సూచనలు, సలహాలు ఇప్పించిన సాక్షి మీడియా వారికి ధన్యవాదాలు. ఇలాంటి సదస్సుల వల్ల ఎంతో ఉపయోగం.

– యు.సనత్‌కుమార్, విశాఖపట్నం

ఎన్నో విషయాలు తెలుసుకున్నాను



బీటెక్ చదువుతున్నాను. గ్రూప్స్‌కు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నాను. సాక్షి మీడియా వారు ఏర్పాటు చేసిన సదస్సుల్లో ఎన్నో విషయాలు తెలుసుకున్నారు. చదువుకునే సమయంలోనే ఇలాంటి సదస్సులకు హాజరవ్వటం వల్ల ఎంతో ఉపయోగం

– బి.మహేశ్వరి, తాటిచెట్లపాలెం, విశాఖ

చక్కగా వివరించారు



చోడవరం సచివాలయంలో ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాను. సాక్షి మీడియా ఆధ్వర్యంలో బాలలత మేడమ్‌తో గ్రూప్స్‌పై సదస్సు ఏర్పాటు చేస్తున్నారని తెలిసి వచ్చాను. గ్రూప్స్ గురించి చక్కగా వివరించారు. గ్రూప్స్‌లో విజయం సాధించాలనేది నా లక్ష్యం.

– ఆర్.మానస, చోడవరం, అనకాపల్లి జిల్లా

క్షయ నివారణకు ప్రత్యేక చర్యలు



చింతపల్లి ఆస్పత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

సీలేరు: మారుమూల ప్రాంత గిరిజనుల్లో అవగాహనతో క్షయ వ్యాధిని దూరం చేయవచ్చని, అందుకు వైద్యులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ టి.విశ్వేశ్వర నాయుడు, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి కృష్ణారావు ఆదివారం సీలేరు ఆస్పత్రిని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. క్షయ నివారణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని, విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలని మెరుగైన వైద్యం అందించాలన్నారు. విలేజీ క్లినిక్‌ల ద్వారా ఇంటింటికీ వైద్యులు వెళ్లి వైద్యం అందించాలని తద్వారా సత్ఫలితాలు కూడా వస్తున్నాయన్నారు.ముఖ్యంగా గర్భిణులు ఆస్పత్రుల్లోని ప్రసవాలు చేయించుకునేలా వైద్యులు ఆశ కార్యకర్తలు బాధ్యత వహించాలన్నారు. వైద్యులు, మస్తాన్ వలీ , కె.శ్యామల పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కృష్ణరావు, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు చింతపల్లి ఏరియా ఆస్పత్రిని ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. వార్డులు, ల్యాబ్, శిశు సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. వార్డుల్లో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మేరుగైన సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అన్ని వేళలో వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు.కార్యక్రమంలో డాక్టర్ గౌతమ్, ఎల్‌టీ అనిల్ పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ దినేష్‌కుమార్ శర్మ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దినేష్‌కుమార్‌శర్మ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను, జ్ఞాపికను అధికారులు అందజేశారు.

శివారు గ్రామాలకు రోడ్డు, రవాణా సదుపాయం



గెడ్డపై వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: మండలంలో కిల్లంకోట మార్గంలో కోడిమామిడి గెడ్డపై ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు పరిశీలించారు. ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాల సరిహద్దు గిరిజన గ్రామాలకు రోడ్డు, రవాణా సౌకర్యాలకు కోడిమామిడి గెడ్డపై వంతెన ఎంతో కీలకం. ఈ ప్రాంత ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని రోడ్డు, రవాణా సదుపాయాలు కల్పించాలని ఉద్దేశంతో వంతెన ఏర్పాటుకు ప్రభుత్వం ఎస్‌సీఏ పథకం కింద రూ.2.20కోట్లు నిధులు కేటాయించింది. ఆయా వంతెన నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. ఎస్టీ కమిషన్ సభ్యుడు విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే మన్యంలోని శివారు గ్రామాలకు రోడ్డు, రవాణా సదుపాయం కల్పించిందన్నారు. పూర్వీకుల కాలం నాటి నుంచి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా గెడ్డపై వంతెన రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదని, ఈ ప్రాంత ప్రజలు అనేక సమస్యలు, ఇబ్బందులు పడుతూ గుర్రాలపై, కాలినడననే రాకపోకలు సాగించేవారన్నారు. గిరిజన ప్రజల అనారోగ్యానికి గురైతే డోలీ మోతేశరణ్యమయ్యేదని, నిత్యావసర సరకులను వారపు సంతలకు తీసుకెళ్లేందుకు ఎన్నో ఇబ్బందులు పడేవారని గుర్తుచేశారు. సరిహద్దు రాష్ట్రాలగిరిజన గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్న తరుణంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి రావడంతో కష్టాలు, సమస్యలకు తెరపడిందన్నారు. గిరిజనుల జీవన ప్రమాణాలు మారాయని, ఆర్థికంగా స్థిరపడ్డారన్నారు. గ్రామాల్లో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు.

శివారు గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయన్నారు. కోడిమామిడి గెడ్డపై గెడ్డపై వంతెన నిర్మాణంతో రోడ్డు రవాణా సదుపాయం త్వరలో అందుబాటులో రానుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రెండు సరిహద్దు రాష్ట్రాల గిరిజన గ్రామాల ప్రజలతో పాటు విశ్వేశ్వరరాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆర్టీసీ 'కార్తీక' స్పెషల్స్



యాత్ర బస్సులను ప్రారంభించిన జిల్లా డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, ద్వారకా బస్ స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ హెచ్.అమరసింహుడు, విశాఖపట్నం డిపో మేనేజర్ గంగాధర్

- ఒకవైపు శైవ క్షేత్రాల దర్శనం.. మరో వైపు పిక్నిక్ స్పాట్స్‌కు ప్రత్యేక సర్వీసులు

అల్లిపురం/డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) విశాఖపట్నం రీజియన్ పంచారామక్షేత్ర దర్శిని, కార్తీకమాసం వనసమారాధనల నేపథ్యంలో లంబసింగి, అరకు, ధారమఠానికి ప్రత్యేక సర్వీసులు నడపనుందని ప్రజా రవాణా అధికారి అప్పలరాజు తెలిపారు.

పంచారామాలకు బస్సులు ప్రారంభం

హైందవ సంప్రదాయంలో కార్తీక మాసానికి విశేష ప్రాముఖ్యత ఉంది. లయకారుడైన ఆ పరమశివుని కార్తీక మాసంలో, అందునా సోమవారం రోజున దర్శిస్తే సకల పాపాలు హరిస్తాయని ప్రతీతి. అందువల్ల ఈ నెల 14 నుంచి కార్తీక మాసం ప్రారంభమైన దృష్ట్యా విశేష పర్వదినాలైన సోమవారం రోజున 5 ప్రముఖ శైవక్షేత్రాలు దర్శించేలా పంచారామ క్షేత్ర దర్శినిని ఆర్టీసీ ప్రవేశపెట్టింది. పంచారామాల సందర్శనకు మూడు బస్సులను ఆదివారం సాయంత్రం ద్వారకా బస్ స్టేషన్‌లో విశాఖ జిల్లా డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, ద్వారకా బస్ స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ హెచ్.అమరసింహుడు, విశాఖపట్నం డిపో మేనేజర్ గంగాధర్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒకే రోజు అమరావతి (అమరేశ్వరుడు), భీమవరం (భీమేశ్వరుడు), పాలకొల్లు (క్షీర రామలింగేశ్వరుడు), ద్రాక్షారామం (భీమలింగేశ్వరుడు), సామర్లకోట (కుమార రామలింగేశ్వరుడు) దర్శించుకునే విధంగా ప్యాకేజీ రూపంలో ఏపీఎస్ ఆర్టీసీ రూపొందించిందన్నారు. ప్రతి ఆదివారం సాయంత్రం ద్వారకాబస్ స్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సుకు ఒక్కొక్కరికి రూ.2,100, అల్ట్రా డీలక్స్ బస్సు రూ.2,050 నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం డిపో అసిస్టెంట్ మేనేజర్ పి.శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

ఏఏ రోజుల్లో..

కార్తీకమాసంలో వచ్చే అన్ని ఆదివారాలు..అనగా ఈ నెల 19, 26, డిసెంబర్ 3, 10 తేదీల్లో సాయంత్రం 5 గంటలకు విశాఖ ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయి. ప్రయాణచార్జీ (ఒక్కరికి) సూపర్‌లగ్జరీ రూ.2,100, అల్ట్రా డీలక్స్..రూ.2050

లంబసింగి టూర్..

కార్తీకమాసం పురస్కరించుకొని పిక్నిక్‌ల సందడి దృష్ట్యా ఆర్టీసీ లంబసింగికి ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఈ బస్సులు శని, ఆదివారాల్లో ఉదయం 3 గంటలకు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బయలుదేరుతాయి. లంబసింగి, తాజంగి డ్యామ్, కొత్తపల్లి వాటర్‌ఫాల్స్, మోదమాంబ గుడి (పాడేరు), కాఫీ తోటలు వీక్షించేలే ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. ప్రయాణచార్జీ (ఒక్కరికి) అల్ట్రాడీలక్స్ రూ.800, ఎక్స్‌ప్రెస్:రూ.650

అరకు టూర్

కార్తీకమాసం పురస్కరించుకొని ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 6 గంటలకు ద్వారకాబస్టేషన్ నుంచి బస్సులు నడపనున్నారు. డముకు వ్యూ పాయింట్, గాలికొండ వ్యూ పాయింట్, చాపరాయి, పద్మాపురం గార్డెన్స్, ట్రైబల్ మ్యూజియం చూపించనున్నారు. ప్రయాణ చార్జీ (ఒక్కరికి) అల్ట్రా డీలక్స్ రూ.800, ఎక్స్‌ప్రెస్..రూ.650

ధారమఠం

కార్తీక మాసంలో వచ్చే ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 7 గంటలకు ద్వారకాబస్టేషన్ నుంచి సర్వీసులు నడపనుంది. శివాలయం, ధారమఠం వాటర్ ఫాల్స్, అల్లూరి సీతారామరాజు మ్యూజియం, బొజ్జన్నకొండ (అనకాపల్లి). ప్రయాణచార్జీ (ఒక్కరికి) అల్ట్రా డీలక్స్..రూ.650, ఎక్స్‌ప్రెస్..రూ.550.

మరిన్ని వివరాలకు..

టికెట్స్ ముందుగా బుక్ చేసుకోదలచే వారు ఏపీఎస్ఆర్టీసీ.ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. లేదా ద్వారకాబస్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్ లో బుక్ చేసుకునే సౌకర్యం కల్పించారు. లేదా 9959225602, 7382921540, 9959225594, 9100109731, 7382914219, 9959221199 నంబర్లలో సంప్రదించవచ్చు.

ట్రైబల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలకు డిగ్రీ విద్యార్థులు



కార్యక్రమంలో పాల్గొనున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

అరకులోయటౌన్: వారాణాసి, చెన్నైలలో ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు జరగనున్న ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో అరకులోయ డిగ్రీ విద్యార్థులు పాల్గొననున్నట్టు ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్, డాక్టర్ సీహెచ్.రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన 24 మంది విద్యార్థులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. వారాణాసిలో జరిగే ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో 10 మంది, చెన్నైలో జరిగే కార్యక్రమంలో 14 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొంటున్నట్టు తెలిపారు. ఎన్ఎస్ఎస్ పీఓలు పి.నాగబాబు, వై.విజయలక్ష్మి, ఎం.అనిత కుమారి మాట్లాడుతూ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో ఆయా విద్యార్థులు పాల్గొనడం సంతోషదాయకమన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రమాదంలో మృతి చెందిన రాజశేఖరరెడ్డి

గంగవరం : పాత గంగవరం శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వై.రామవరం మండలం చౌటిదిబ్బల గ్రామానికి చెందిన కందుకూరి రాజశేఖరరెడ్డి (24) మృతి చెందాడు. దీనికి సంబంధించిన ఎస్ఐ బి.రామకృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదివారం రాత్రి 8.30 సమయంలో పాతగంగవరం శివారు మలుపులో గోకవరం వైపు నుంచి రాజశేఖరరెడ్డి బైక్ వస్తుండగా ఎదురుగా వస్తున్న టాటా బోలేరో వ్యాను ఢీకొట్టడంతో రాజశేఖరరెడ్డి అక్కడక్కడ మృతి చెందినట్టు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. మృతదేహాన్ని పోలీసు స్టేషన్‌కు తరిలించామన్నారు. పోస్టమార్టం కోసం రంపచోడవరం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తామని ఆయన తెలిపారు.

మోదకొండమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి కార్తీక ఆదివారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. అనకాపల్లి, విశాఖపట్నం, నర్సీపట్నం, రావికమతం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలను శిరస్సున పెట్టుకుని అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఆలయ కమిటీ భక్తులకు ఉచితంగా ప్రసాదం తాగు నీరు అందించింది.